క్లుప్తంగా

విఘ్నేశ్వరుడికి ఎమ్మెల్యే పూజలు



తిరువూరు: మండలంలోని చౌటపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిరిలో బుధవారం ఎమ్మెల్యే రక్షణనిధి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీగణపతి విగ్రహాలకు విశేషాలంకరం చేసిన అనంతరం ఎమ్మెల్యేను జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి పట్టువస్త్రాలతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్‌చాలీసా పారాయణం



గంపలగూడెం: వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా మూడో రోజు కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా శిబిరాల్లో ఉదయం స్వామికి విశేష పూజలు, సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన చేశారు. గంపలగూడెం గాంధీసెంటర్ వద్ద ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి శిబిరం వద్ద మేడూరుకు చెందిన ముత్యాల వెంకటేశ్వరరావు భక్తబృందంచే హనుమాన్ చాలీసా పారాయణ భక్తిభావంతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఊటుకూరు గాంధీసెంటర్ వద్ద శిబిరంలో గంపలగూడెంకు చెందిన సమరతసేవా సమితి సభ్యులతో వెంకటేశ్వర గానామృత పఠనం గావించారు. సేవాసమితి ప్రతినిధులు వనమా సుజాత, వనమా సత్యవాణి పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మైలవరం: పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ మైలవరం నియోజకవర్గ నాయకులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆ పార్టీ నాయకులు తెలిపారని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇంకొల్లు జమలయ్య తెలిపారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు మైలవరంలో నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగేశ్వరరావు, తొమ్మండ్రు యేసు, యోహాన్, మరియదాస్, ఆలూరి కల్యాణ్ పాల్గొన్నారు.

బీమా రూ.లక్ష అందజేత



కొణిజెర్ల(గంపలగూడెం): గంపలగూడెం మండలం కొణిజెర్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సభ్యుడు కర్నాటి గోపాలకృష్ణ ఇటీవల మరణించగా ఇన్సూరెన్స్ రూ.లక్ష మంజూరైంది. సంబంధిత మొత్తాన్ని మృతుడి భార్య కర్నాటి జయశ్రీకి సొసైటీ అధ్యక్షుడు నంబూరి వెంకట కృష్ణారావు, సీఈఓ ఎస్‌ఎం సుభానీలు అందజేశారు. సొసైటీ డైరెక్టర్ మోదుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



ఇబ్రహీంపట్నం: సమాజంలో దివ్యాంగులను ప్రతిఒక్కరూ ఆదరించాలని గ్రేస్‌మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మోగులూరి ఏలిషా అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని భవిత దివ్యాంగుల కేంద్రంలో చిన్నారులకు దుప్పట్లు, బిస్కెట్లు బుధవారం పంపిణీ చేశారు. అమెరికా నుంచి వచ్చిన బ్రదర్ నాథల్, లిండ్‌సే దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

రెండు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

తిరువూరు: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. అక్కపాలెం, చౌటపల్లి సచివాలయాల్లో ఈ క్యాంపులను నిర్వహించగా, 10 సంవత్సరాలకు పైగా అప్‌డేట్ చేయని ఆధార్‌కార్డుల నవీకరణ, కార్డుల్లో తప్పుల సవరణ, చిరునామా మార్పు తదితర అవసరాల నిమిత్తం 20 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలి పారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

లబ్ధిదారుల మోములో చిరునవ్వు

- కోలాహలంగా పింఛన్ల పంపిణీ
- నూతనంగా మంజూరైనవి 711
- మొత్తం వైఎస్సార్ పింఛన్ కానుకలు 11,785



గంపలగూడెం మండలం ఊటుకూరులో పింఛన్ తీసుకున్న ఆనందంలో డప్పు వాయిస్తున్న కళాకారులు

గంపలగూడెం: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కోలాహలంగా నిర్వహిస్తున్నారు. దీంతో లబ్ధిదారుల మోములో చిరునవ్వు కనిపిస్తోంది. వైఎస్సార్ పింఛన్ కానుక కోరుతూ ఈ ఏడాది ప్రారంభం (2023 జనవరి1) నుంచి జూలై ఆఖరు వరకు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించిన పిదప ఉన్నతాధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఆరునెలలకు ఒక పర్యాయం ఆ వ్యవధిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుకలను మంజూరు చేస్తోందని అనేందుకు ఇదే నిదర్శనం. గంపలగూడెం మండలానికి ఈ విడత 711 నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో సచివాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో అధికారులు, సచివాలయం సిబ్బంది పింఛన్ నగదు అందజేస్తున్నారు.

సచివాలయాల వారీగా పింఛన్ లబ్ధిదారులు

అమ్మిరెడ్డిగూడెంకు 39, అనుముల్లంకకు 31, ఆర్లపాడు 68, చింతనర్వ 30, దుందిరాలపాడు 63, గంపలగూడెం 44, గోసవీడు 15, గుళ్లపూడి, లింగాలకు కలిపి 20, కనుమూరు 30, కొణిజెర్ల 34, కొత్తపల్లి 47, మేడూరు 19, నెమలి 28, పెద్దకొమిర 14, పెనుగొలను, రాజవరం కలిపి 96, తునికిపాడు 21, వినగడప 43, ఊటుకూరు 69 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి.

11,785కు చేరిన లబ్ధిదారులు

గంపలగూడెం మండలంలో ఈ నెల నుంచి వివిధ రకాల సామాజిక పింఛన్లు కొత్తవాటితో కలిపి 11,785కు చేరాయి. వీరికి పంపిణీ చేసేందుకు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.3.25 కోట్లను విడుదల చేయగా వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పంపిణీ చేశారు.

అర్హులందరికీ మంజూరు



జూలై ఆఖరు వరకు పింఛన్ కోరుతూ దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత ఉన్నవారందరికీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. మండలంలో ప్రస్తుతం 11,785 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం.

– వై పిచ్చిరెడ్డి, ఎంపీడీఓ, గంపలగూడెం

కోలాహలంగా బాలికల ఆటల పోటీలు



గంపలగూడెంలో నియోజకవర్గ స్థాయి బాలికల కబడ్డీ పోటీ

గంపలగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తిరువూరు నియోజకవర్గస్థాయి బాలికల అండర్–14, 17 విభాగాలలో పోటీలు బుధవారం గంపలగూడెంలో కోలాహలంగా జరిగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ఎనిమిది రకాల ఆటలను ఆడించారు. తిరువూరు, గంపలగూడెం, ఏ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో మండల స్థాయిలో నిర్వహించిన పోటీలో ఎంపికైన టీములు నియోజకవర్గ స్థాయిలో తలపడ్డాయి. కబడ్డీ, ఖో–ఖో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ విజేతలు డివిజన్ స్థాయి పోటీలకు హాజరౌతారు. ఆటల పోటీల కమిటీ నియోజకవర్గ కన్వీనర్ గుర్రం గోపాలరావు, మండల కన్వీనర్ అంజయ్య, కో– కన్వీనర్ రాంబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలను కొనసాగించారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు పోటీలను పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు కనకారావు, కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలతో దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి

మైలవరం: డిజిటల్ ఆర్థిక లావాదేవీలు విపరీతంగా పెరిగాయని, దీని వలన దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి దోహద పడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో భారతదేశంలో డిజిటల్ ఆర్థిక సేవలు అనే అంశంపై వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపొందడానికి ఎక్కువ అవకాశాలున్నాయని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కే వంశీకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు డిజిటల్ చెల్లింపులు యూపీఐ, ఐఎంపీఎస్, ఆర్‌టీజీఎస్, ఎన్‌ఈఎఫ్‌టీ, డిజిటల్ కార్డ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంక్ విజయవాడ సేల్స్ మేనేజర్ నరేంద్ర పీఓఎస్‌పై అవగాహన కల్పించారు. అధ్యాపకులు ఎం. శ్రీనివాసరావు, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌కే కరీముల్లా, ఎకనామిక్స్ విభాగాధిపతి, కామర్స్ అధ్యాపకులు జీ.నారాయణరావు, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన



అమ్మవారిగూడెంలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి చెన్నారావు

నూజివీడు(ఆగిరిపల్లి): వరి పంటలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు, అగ్గితెగులు ఉన్నట్లు వ్యవసాయాధికారి చెన్నారావు పేర్కొన్నారు. ఆగిరిపల్లి మండలం అమ్మవారిగూడెం, చొప్పరమెట్ల గ్రామాల్లోని వరి పొలాలను బుధవారం ఆయన పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆకు ముడత నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడు 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంత్రనిలిప్రోల్ 0.4 గుళికలు ఎకరానికి నాలుగు కేజీలు చొప్పున లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడు రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు అలవరుచుకోవాలి



తిరువూరు ప్రతిభ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

తిరువూరు: డిగ్రీ చదివే విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తిరువూరు ప్రతిభా విద్యాసంస్థల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్ అన్నారు. కళాశాల ప్రథమ సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ సీనియర్లు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డేలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో, ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు



తిరువూరులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

తిరువూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తిరువూరు నగర పంచాయతీ అధికారులు వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. దోమల నిర్మూలనకు మలాథియాన్, ఎబేట్ పిచికారీ చేయడంతో పాటు మురుగుకాలువల్లో నీరు పారే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. నివాసగృహాల నుంచి రోడ్లపైకి వాడకం నీరు పోకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలని, రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహారపదార్థాలు తినవద్దని కమిషనర్ బాలకృష్ణ సూచించారు. జ్వరపీడితుల సర్వే చేయాలని వార్డు ఆరోగ్య కార్యదర్శుల్ని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు



చాట్రాయిలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

చాట్రాయి: గణపతి నవరాత్రులు సందర్భంగా మండలంలో మూడో రోజు వినాయక పూజలు ఘనంగా నిర్వహించారు. భజనలు పాటలతో ఉదయం, సాయంత్రం పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా అక్కినేని జయంతి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో బుధవారం షిరిడీసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అభిమానులు మాట్లాడుతూ అక్కినేని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో పాటు ఏడు నంది, ఐదు ఫిలింఫేర్ అవార్డులు అక్కినేని గెలుచుకున్నారని కొనియాడారు. సేవా సమితి సభ్యులు శీలం శ్రీనివాసరెడ్డి, ముక్కెర శ్రీకాంత్ రెడ్డి, మీనుగు ఆకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్‌ను సక్రమంగా వినియోగించుకోవాలి

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం): వైఎస్సార్ పింఛన్ కానుకలను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని అమ్మిరెడ్డిగూడెం సర్పంచ్ బజ్జూరి చంద్రశేఖర్ అన్నారు. గ్రామంలో నూతనంగా మంజూరైన 40 పింఛన్లను స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు తమ్మారపు శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, చిన్నకొమెర సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. డిజిటల్ అసిస్టెంట్ నరేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాధాకృష్ణ, సచివాలయం సెక్రటరీ రాంబ్రహ్మం పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ పోటీలు

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్గత స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ పోటీలను నిర్వహించారు. స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ ప్రాముఖ్యతను కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్ విద్యార్థులకు వివరించారు. కంప్యూటర్ రంగంలో సృజనాత్మకతతో కూడిన నూతన ఆవిష్కరణలకు ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పారు. సీఎస్‌ఈ విభాగాధిపతి డి.సునీత మాట్లాడుతూ నిజ సమయంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను కంప్యూటర్ విజ్ఞానంతో ఎలా పరిష్కరించవచ్చో విద్యార్థులకు వివరించారు. సాంకేతికతను గ్రామీణాభివృద్ధికి ఉపయోగించడం ద్వారా దేశాన్ని మరింత వేగంగా అభివృద్ధిలోకి తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆర్ వెంకట్రావు, సీఎస్‌ఈ డీన్ కేవీ సాంబశివరావు, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, విజిటింగ్ ప్రొఫెసర్ చంద్రశేఖరం, ఇతర బ్రాంచ్‌ల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

నూజివీడు(ఆగిరిపల్లి): తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై నంబూరు చంటిబాబు తెలిపారు. ఆగిరిపల్లి మండలం సూరవరానికి చెందిన కొప్పుల జోష్ణదేవికి 18 ఏళ్ల క్రితం రాజారావు అనే అతనితో వివాహం అయింది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. రాజారావు వ్యసనాలకు బానిసవ్వడంతో పాటు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కుటుంబాన్ని సరిగా పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితిలో కొన్ని రోజులుగా ఇంటికి రావడం లేదని, కనబడటం లేదని జోష్ణదేవి ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితులకు వంట సామగ్రిని అందజేసిన విద్యార్థులు

చాట్రాయి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు విద్యార్థులు సాయం అందించారు. చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన ఘంటసాల శ్రీను గృహం ఇటీవల విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు సేకరించిన విరాళాలు యాజమాన్యం, ఉపాధ్యాయులు కలిసి సుమారు రూ.3 వేల విలువ చేసే వంట సామగ్రి కొనుగోలు చేసి బుధవారం బాధితులకు అందజేశారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరులో హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే రక్షణనిధి సమీక్ష

తిరువూరు: పట్టణంలోని పీటీకొత్తూరులో పేదలకు పంపిణీ చేసిన జగనన్న కాలనీలలో పక్కా గృహాల నిర్మాణానికి లబ్ధిదారులను ప్రోత్సహించాలని స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి కోరారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం జగనన్న కాలనీల ప్రగతిపై హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. సచివాలయాల వారీగా లబ్ధిదారుల వివరాలను సేకరించి ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషిచేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రహదారులను ప్రారంభించిన ఎమ్మెల్యే



తిరువూరు ఐదో వార్డులో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరువూరు: తిరువూరు ఐదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్యే రక్షణనిధి బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఈ నిధులను కేటాయించినట్లు తెలిపారు. నగరపంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, అనుమోలు రమాదేవి, ఏరువ ప్రకాష్‌రెడ్డి, పరసా శ్రీనివాసరావు, పరసా సత్యనారాయణ, మోదుగు ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నడింతిరువూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గజ్జల సీతారామయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమం



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న జేసీ సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి

మైలవరం: గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్నకు చెబుదాం' అనే పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి తెలిపారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం (జేకేసీ–స్పందన) కార్యక్రమం బుధవారం ఎంపీపీ ప్రసన్నరాణి అధ్యక్షతన జరిగింది. గ్రామస్తులు తమ గ్రామాల్లోని సమస్యలు జిల్లా అధికారులు దృష్టికి అర్జీల ద్వారా తీసుకురావాలన్నారు. సబ్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మైలవరం గ్రామం వార్డు సభ్యుడు చిట్టిబాబు రైతులకు నీరు అందకుండా వాగులో మోటార్లు ఏర్పాటు చేసి, చేపల చెరువుకు నీరు పెట్టుకుంటున్నారని, స్థానిక అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు. దీనిపై పరిశీలన కమిటీ ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్‌పీలకు జూలై, ఆగస్టు 2023 నెలల జీతాలు నేటి వరకు ఇవ్వలేదని, ఇబ్బందులు పడుతున్నామని అర్జీ అందజేశారు. సమస్యలను ప్రజలు అర్జీల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పీ సంపత్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఎస్.తిరుపతిరావు, డీఈఓ, డీఎంహెచ్‌ఓ పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలకు చేరాలి



విద్యార్థినులకు రికార్డులను అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నూజివీడు: ప్రభుత్వం, దాతలు కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ అధ్యక్షుడు గొల్లపూడి రవిబాబు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ విద్యార్థినులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రికార్డు బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ విద్య ద్వారానే జీవితాల్లో మార్పు సాధ్యమని, ప్రతిఒక్కరూ దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం బీవీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ చదువు ద్వారా మాత్రమే ఏదైనా సాధించగలుగుతామని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశలను ఒమ్ము చేయకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. ఈ ఏడాది తమ పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెంకటరత్నం, క్లబ్ సభ్యులు మూల్పూరి లక్ష్మణస్వామి, త్రివిధ శ్రీనివాస్, రత్నాకర్, బోయపాటి ముఖర్జీ, మలిశెట్టి శ్రీనివాస్, వై.రాజగోపాల్, కె.సత్యనారాయణ, శశికాంత్ పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు పక్కాగా ఉండాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగమణమ్మ



వెల్వడం గ్రామంలో పంట పొలాలు పరిశీలించిన నాగమణమ్మ, సంధ్యారాణి

వెల్వడం(మైలవరం): రైతులు తప్పని సరిగా తమ పంటలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సాక నాగమణమ్మ తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలో పంట పొలాలు బుధవారం సందర్శించారు. ఈ–క్రాప్ నమోదు తనిఖీలో భాగంగా ఈ–క్రాప్ నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. వరి పొలాలు సాగు చేస్తున్న కౌలు రైతులతో మాట్లాడారు. కౌలు రైతులు వేసిన పంటలను, సర్వే నంబర్లు తనిఖీ చేశారు. సీసీఆర్‌సీ కౌలు కార్డుదారులు అందరూ లోన్ పొందాలన్నారు. ఈ నెల 25వ తేదీలోగా పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసి రైతులు ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా పాస్‌బుక్ వచ్చిన వారు రైతు భరోసా కోసం స్థానిక ఆర్‌బీకేలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎం–కిసాన్ పొందాలంటే ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి శివరామకృష్ణ పాల్గొన్నారు.

సూర్య నమస్కారాల పోటీల్లో జనార్దన్‌కు ద్వితీయస్థానం

ఇబ్రహీంపట్నం: యోగాసానాలు, సూర్య నమస్కారాల పోటీల్లో ఇబ్రహీంపట్నానికి చెందిన లంకే జనార్దన్‌కు ద్వితీయ స్థానం లభించింది. విజయవాడ పడమటలోని శ్రీ గణపతి సచ్చిదానంద యోగాశ్రమంలో ఈ నెల 15, 16 తేదీలలో వివిధ విభాగాలలో యోగాసన పోటీలు నిర్వహించారు. 46 ఏళ్లకు పైబడిన విభాగంలో జనార్దన్ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచారు. బుధవారం సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికల అందజేశారు. పలువురు యోగా గురువు జనార్దన్‌ను అభినందించారు.

మందుల దుష్ఫలితాలపై అవగాహన పెరగాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మందుల దుష్ఫలితాలు వచ్చినప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించేలా ప్రజల్లో అవగాహన పెరగాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ఫార్మకో విజిలెన్స్ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకుని వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ సుధాకర్ జెండా ఊపి ప్రారంభించగా, ఎంబీబీఎస్ మొదటి, రెండో ఏడాది విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.